క్లుప్తంగా

మొగల్తూరులో ఫ్యామిలీ ఫిజీషియన్

మొగల్తూరు: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ లీనా సుప్రియ కోరారు. మంగళవారం మొగల్తూరు 2 సచివాలయ పరిధిలోని వైఎస్సార్ ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రానికి వచ్చిన సుమారు 70 మంది రోగులకు సేవలందించారు. నడవలేని పరిస్థితిలో ఉన్న రోగులు ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు చేసారు. ఈకార్యక్రమంలో సిబ్బంది సావిత్రి, జ్ఞానానంద, చాందనీ ప్రియ, ప్రభాకర్ ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు ముదకల గోపాలరావు

యలమంచిలి: అంబేడ్కర్ సేవా సమితి సభ్యులు మంగళవారం ఆర్యపేటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సేవా సమితి సభ్యులు ముదకల గోపాలరావు మాట్లాడుతూ విద్య ద్వారా మాత్రమే మనిషి వృద్ధిలోనికి వస్తారన్నారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ అన్ని వసతులు కల్పిస్తోందన్నారు. పేద విద్యార్థుల చదువుకు సహకరించాలనే సదాశయంతో నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ నల్లి ఆశ, ప్రధానోపాధ్యాయుడు మండపాక రాంబాబు, సహోపాధ్యాయులు గంగాభవాని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ యువజన విభాగ అధ్యక్షుల నియామకం



తిరుమాని నాగరాజు



చినిమిల్లి చంద్రశేఖర్ (చందు)



ఆబోతు అర్జున్‌కుమార్




వేగి రాజశేఖర్

నరసాపురం రూరల్: నరసాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుల నియామకాన్ని మంగళవారం సాయంత్రం చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ప్రకటించారు. నరసాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ యువజన విభాగం కోఆర్డినేటర్‌గా తిరుమాని నాగరాజు, నరసాపురం పట్టణ వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడిగా ఆబోతు అర్జున్‌కుమార్, నరసాపురం మండల వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడిగా చినిమిల్లి చంద్రశేఖర్ (చందు), మొగల్తూరు వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షులుగా వేగి రాజశేఖర్ (బాబి) నియమితులయ్యారు. నూతనంగా నియమితులైన నియోజకవర్గ వైసీపీ యువజన విభాగం అధ్యక్షులను పలువురు నాయకులు, పార్టీ కార్యకర్తలు అభినందించారు.

వైఎస్సార్ సీపీకి ప్రజల మద్దతు

పెనుమంట్ర: గత అసెంబ్లీ ఎన్నికల్లో రెండు స్థానాల్లో పోటీచేసి పరాజయం పొందిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆయా నియోజకవర్గాలను ఏనాడు పట్టించుకోలేదని విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరక్టరు కొవ్వూరి వేణుమాధవ రెడ్డి విమర్శించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నర్సాపురం వారాహి యాత్రలో రాష్ట్ర ప్రభుత్వంపై పవన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రెండు చోట్లా ఓడిన పవన్ ఉభయ గోదావరి జిల్లాల్లో 34 సీట్లు ఏ విధంగా గెలుస్తారంటూ ఎద్దేవా చేశారు. ప్రజలంతా వైఎస్సార్ సీపీకి అండగా ఉన్నారని అన్నారు. గత అసెంబ్లీ స్థానాలకంటే అధికంగా సీట్లు వైఎస్సార్ సీపీ గెలవడం ఖాయమన్నారు.

ప్లాస్టిక్ కవర్ల స్వాధీనం



నరసాపురంలో ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్న మున్సిపల్, సచివాలయ సిబ్బంది

నరసాపురం రూరల్: నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంపై నరసాపురం మున్సిపాలిటీ కఠిన చర్యలు చేపడుతుందని మున్సిపల్ కమిషనర్ పేర్కొన్నారు. పట్టణంలో మంగళవారం మెయిన్‌రోడ్డు, మార్కెట్ ఏరియాలోని కిరాణా, జ్యూస్ సెంటర్లు హోటళ్లు, స్వీట్ షాపులు, బేకరీలు తదితర షాపుల వద్ద ఆకస్మిక తనిఖీ చేపట్టి ప్లాస్టిక్ కవర్లను సేకరించారు. శానిటేషన్ టాస్క్‌ఫోర్స్ టీంలతో కలిసి సచివాలయ, మున్సిపల్ సిబ్బంది ఈ దాడులను నిర్వహించారు. సుమారు 40 కిలోల ప్లాస్టిక్ సామగ్రిని స్వాధీనపరచుకుని సదరు షాపుల వారికి రూ.పది వేలు జరిమానాలు విధించారు.

ఆచంట కూడలి అభివృద్ధికి ప్రణాళిక



ఆచంట కూడలి అభివృద్ధి పనులపై అధికారులతో మాట్లాడుతున్న, మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



తూర్పుపాలెంలో ఫిష్ వ్యాన్‌ను ప్రారంభిస్తున్న, మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: ఆచంట కూడలి అభివృద్ధి పనులను వేగవంతం చేయనున్నట్లు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మంగళ వారం ఆచంట కూడలిని ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఎన్నో ఏళ్లుగా ఆచంటలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. కూడలిని సుందరీకరించి పట్టణస్థాయిలో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కూడలి వద్ద బస్టాండు నిర్మాణంతో పాటు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. కూడలి వద్ద భూగర్భ డ్రైయినేజీ నిర్మాణం చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. హైటెన్షన్ విద్యుత్ తీగలు మార్పుతో పాటు, విద్యుత్ ట్రాన్స్ ఫారంను, గ్రంథాలయాన్ని వేరే చోటకు మార్పు చేయాలన్నారు. రహదారి విస్తరణ పనులు సైతం చేపట్టనున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పెచ్చెట్టి సత్యనారాయణ, కోట వెంకటేశ్వరరావు, కుక్కల కిరణ్‌కుమార్, వేమన అప్పారావు, మండే శ్రీనివాస్, అద్దాల సూర్యప్రసాద్, ఎలక్ట్రికల్ ఏడీఈ, గ్రామ కార్యదర్శి జీవీ నాగబాబు పాల్గొన్నారు.

సత్వరం కమ్యూనిటీ భవన నిర్మాణాలు

అన్ని వసతులు ఉండే విధంగా ఆచంటలో కమ్యూనిటీ భవన నిర్మాణాలు వేగవంతంగా చేపట్టాలని మాజీ మంత్రి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మంగళవారం తూర్పుపాలెంలో ఆచంటలోని తొమ్మిది కమ్యూనిటీ భవన నిర్మాణాలపై ఇంజినీరింగ్ అధికారులు, ఆయా సంఘాల నాయకులతో సమీక్ష నిర్వహించారు. పార్టీ నాయకులు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

యువత ఉపాధికి అవకాశాలు

పెనుగొండ: రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మంగళవారం సిద్ధాంతం గ్రామానికి చెందిన రాపాక మహేష్‌కు సబ్సిడీపై మంజూరైన ఫిష్ సప్లై వ్యాన్‌ను ప్రారంభించారు. ప్రజలకు పౌష్టికాహారం అందించడానికి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఫిష్ ఆంధ్ర ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వెలగల వెంకటరమణ, ఎంపీటీసీ అనురాధ, విద్య మౌలిక సదుపాయాల కార్పొరేషన్ డైరక్టరు కొవ్వూరి వేణుమాధవ రెడ్డి, యువజన విభాగ నాయకులు కీర్తి బాలాజీ, ఏడీఏ ఫేలు వెంకటేశ్వరరావు, ఏ ఏడుకొండలు, పాడేటి రాంబాబు, ఏడుకొండలు పాల్గొన్నారు.

యాంత్రీకరణతో ఖర్చు ఆదా

వ్యవసాయ రంగంలో యాంత్రీకరణతో ఖర్చు ఆదా అవుతుందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మంగళవారం తూర్పుపాలెంలో సబ్సిడీపై అందించి గడ్డి కోత యంత్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పశుబీమా సద్వినియోగం చేసుకోండి

నరసాపురం రూరల్: పాడి రైతులు ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు సుధాకర్ పేర్కొన్నారు. స్థానిక పశు వైద్యశాలలో మంగళవారం సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులు చనిపోతే రైతులు నష్టపోకుండా బీమా అండగా ఉంటుందన్నారు. టోల్‌ఫ్రీ నంబరు 1962ను పాడి రైతులందరూ వినియోగించుకోవాలని కోరారు

ఆసుపత్రిలో వ్యక్తి మృతి

పాలకొల్లు సెంట్రల్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం సోమవారం రాత్రి 108 సిబ్బంది అనారోగ్యంతో ఉన్న ఒక వ్యక్తిని తీసుకువచ్చి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. అతనికి చికిత్స చేసి ఆసుపత్రిలో బెడ్ ఏర్పాటుచేశారు. ఆ వ్యక్తి మంగళవారం ఉదయం లేచి బాత్రూమ్‌కు వెళ్లి అక్కడ పడి చనిపోయినట్లు ఆసుపత్రి సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. ఇతని వయస్సు సుమారు 40 నుంచి 50 ఏళ్ల మధ్యలో ఉండవచ్చని అతని ఒంటిపై ఎరుపు రంగు టీ షర్టు, నలుపు, తెలుపు చారలతో నిక్కరు ఉన్నట్లు తెలిపారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు



మేడపాడు హైస్కూల్లో తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్

యలమంచిలి: నాలుగేళ్లలో ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందని మేడపాడు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు డి ప్రసాద్ చెప్పారు. పాఠశాలలో మంగళవారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019 నుంచి ప్రభుత్వ పాఠశాలల స్వరూపం, విద్యా విధానం కార్పొరేట్ తరహాగా మారిందన్నారు. ఒకవైపు పాఠశాలల రూపురేఖలు మారుస్తూనే మరొక వైపు విద్యా ప్రమాణాలు పెంచారన్నారు. ముఖ్యంగా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జగనన్న గోరుముద్ద ద్వారా వారికి పౌష్టికాహారం అందిస్తున్నట్లు వివరించారు. నాణ్యమైన సమాజ నిర్మాణానికి విద్యార్థుల అవసరాలను గుర్తించి అనేక పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలో చేర్పించి వదిలేయకుండా వారు ఎలా చదువుతున్నారో ఎప్పటికప్పుడు వాకబు చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ గుర్రాల వెంకట్రావు, ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభ, డేగల వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ ముద్దల శ్రీనివాస్, వెల్ఫేర్ అసిస్టెంట్ గురుజు శైలజ ఉపాధ్యాయులు మంచెం వెంకటేశ్వరరావు, వంతం రామ్మూర్తినాయుడు, రేలంగి రామకృష్ణ పాల్గొన్నారు.

ఫెర్రీ బకాయిలపై జేఏసీ సమావేశం



మండల పరిషత్‌లో సమావేశమైన జేఏసీ సభ్యులు

నరసాపురం రూరల్: నరసాపురం మండల పరిషత్ ఆధీనంలోని మాధవాయిపాలెం ఫెర్రీకి సంబంధించి పాటదారుడు 2 వాయిదాల సొమ్ము రూ.60 లక్షలు బకాయి పడటంతో దీనిపై చర్చించేందుకు ఉభయ గోదావరి జిల్లాల జేఏసీ సభ్యులు సమావేశమయ్యారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ సమావేశం ఏర్పాటు చేశారు. పాటదారుడు బకాయి పడిన సొమ్మును సెలాఖరుకు చెల్లిస్తానని జేఏసీ సభ్యులకు చెప్పారు. దీంతో జూలై మొదటి వారంలో జేఏసీ తిరిగి సమావేశమై ఈ విషయంపై చర్చించాలని నిర్ణయించారు. సానుకూల ఫలితాలు రాకపోతే రేవు నిర్వహణను స్వాధీనం చేసుకుని 2023–2024 ఆర్థిక సంవత్సరంలో మిగిలిన కాలానికి ఫెర్రీ వేలం నిమిత్తం టెండర్లు పిలవాలని నిర్ణయించినట్లు జేఏసీ తెలిపింది. సమావేశంలో ఎంపీపీ మైలాబత్తుల సోనీ, జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, లక్ష్మణేశ్వరం సొసైటీ అధ్యక్షుడు, జేఏసీ సభ్యుడు దొంగ మురళీకృష్ణ, ఎంపీడీవో ఎస్వీ శివప్రసాద్‌యాదవ్, నరసాపురం, సఖినేటిపల్లి మండలాల ఈవోపీఆర్డీలు, అంజనేయశర్మ, లక్ష్మీనారాయణ, నరసాపురం మండల పరిషత్ కార్యాలయ పర్యవేక్షకుడు వీరభద్రరావు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



విద్యా కమిటీ సమావేశానికి హాజరైన తల్లిదండ్రులు

పాలకొల్లు సెంట్రల్: తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపిస్తే సరిపోతుందని వారి భవిష్యత్‌కు కావలసిన మెరుగైన విద్యను ప్రభుత్వమే అందిస్తుందని ప్రధానోపాధ్యాయులు ఆర్ విష్ణుమూర్తి తెలిపారు. మంగళవారం స్థానిక ఏ.వి.ఎస్.ఎన్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో విద్యా కమిటీ ఆధ్వర్యంలో తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విష్ణుమూర్తి మాట్లాడుతూ పాఠశాలకు వచ్చే విద్యార్థికి ప్రభుత్వం అనేక పథకాలను అందిస్తోందన్నారు. ఈ సందర్భంగా జగనన్న ఆణిముత్యాలు, విద్యాశాఖ సందేశం తల్లిదండ్రులకు వివరించారు. ఈ సమావేశానికి సుమారు 200 మంది తల్లిదండ్రులు హాజరయ్యారు. విద్యా కమిటీ చైర్మన్ కోట్ల దుర్గాభవాని పాల్గొన్నారు.

ప్రజలంతా వైఎస్సార్ సీపీ వైపే



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: కుల, మత ప్రాంత, వర్గ, పార్టీ, తారతమ్యాలు లేకుండా సంక్షేమాన్ని అందిస్తున్న వైఎస్సార్ సీపీ వైపే ప్రజలందరూ ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మంగళవారం ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు క్యాంపు కార్యాలయంలో మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీల త్రిసభ్య కమిటీలు సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రగతి, సంక్షేమం, గత ప్రభుత్వానికి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసాన్ని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని పట్టించుకోకుండా కొందరు స్వార్థంతో చేస్తున్న విమర్శలు పట్టించుకోవలసిన అవసరం లేదన్నారు. కోట్లాది రూపాయలతో నరసాపురం నియోజకవర్గంలోని రహదారులను సుందరంగా నిర్మిస్తున్నామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో అవినీతికి తావులేని వినూత్నమైన పాలనను అందిస్తున్నామన్నారు. పార్టీని బలోపేతం చేయడంలో శ్రేణుల పాత్ర కీలకమని ఉద్బోధించారు.

సీఎం సహాయ నిధి అందజేత



తూర్పుపాలెంలో రూ.10లక్షల చెక్కును అందిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుమంట్ర: జుత్తిగ గ్రామ సచివాలయంలో వ్యవసాయ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన పెనుమంట్రకు చెందిన మంగా ఐశ్వర్య కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.10లక్షల చెక్కును మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అందించారు. తూర్పుపాలెంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఐశ్వర్య తండ్రి మంగా నారాయణరావుకు చెక్కు అందించారు. ఐశ్వర్య 2019లో విధుల నిర్వహిస్తుండగా జుత్తిగ నుంచి పెనుమంట్ర మండల కార్యాలయానికి మోటార్ బైక్‌పై వెళ్తుండగా బ్రాహ్మణ చెరువు వద్ద మరో వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడింది. హైదరాబాదులో సుమారు నెలరోజులకు పైగా వైద్యం అందించినా ఫలితం దక్కలేదు. ఆ కుటుంబం ఆర్థికంగా చితికి పోవడంతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి సహాయాన్ని అందించి మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు అండగా నిలిచారు. కార్యక్రమంలో పెనుమంట్ర జెడ్పీటీసీ కర్రి గౌరీ సుభాషిణి, పెనుమంట్ర సర్పంచ్ తాడిపర్తి ప్రియాంకా ప్రసన్నకుమార్, ఉప సర్పంచ్ భూపతిరాజు శ్రీనివాసరాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు తేతలి సుధీర్ రెడ్డి, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ కొవ్వూరి చిన్నారెడ్డి పాల్గొన్నారు.

అమ్మ ఒడితో పేద విద్యార్థుల చదువుకు భరోసా



ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ పెన్మెత్స పద్మ

పాలకొల్లు అర్బన్: పేద, మధ్య తరగతి విద్యార్థులకు అమ్మ ఒడి పథకంలో ఆర్థిక సహాయం చేయడం విద్యాపరంగా ముందుకు సాగడానికి ఎంతో వీలుంటుందని సర్పంచ్ పెన్మెత్స పద్మ అన్నారు. పాలకొల్లు మండలం వడ్లవానిపాలెం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నిర్వహించిన తల్లిదండ్రుల కమిటీ సమావేశంలో సర్పంచ్ పద్మ మాట్లాడారు. విద్యార్థి, విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లోకి డబ్బులు పడకపోతే తక్షణం సచివాలయంలో సంప్రదించాలని కోరారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స ఏసురాజు, పాఠశాల హెచ్ఎం పి వరలక్ష్మి, సహోపాధ్యాయుడు జి ప్రసాదరాజు, పీఎంసీ చైర్మన్ ఆర్ సూర్యకుమారి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలి



మార్టేరు బాసంతీ దేవి ఉన్నత పాఠశాల పేరెంట్స్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సుభాషిణి

పెనుమంట్ర: తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బాధ్యతగా విద్యార్థులతో వ్యవహరించి వారి అభ్యున్నతికి కృషి చేయాలని పెనుమంట్ర జెడ్పీటీసీ కర్రి సుభాషిణి అన్నారు. మంగళవారం మార్టేరులోని బాసంతి బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల్లో అనేక మౌలిక వసతులు కల్పిస్తున్నారన్నారు. పేద విద్యార్థుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మట్టా కుమారి, ఉప సర్పంచ్ కర్రి వేణుబాబు, మట్టారాము, ప్రధానోపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ కన్వీనరు టీఆర్ సాంబశివరావు, విద్యా కమిటీ చైర్మన్ సాకా శివకుమార్, వైస్ చైర్మన్ బిరుదు కోట మణి పాల్గొన్నారు.

ప్రైవేటు కళాశాలల వద్ద ఆందోళన



ప్రైవేటు కళాశాలల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

నరసాపురం రూరల్: ప్రైవేటు కళాశాలల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు మంగళవారం ఆందోళన నిర్వహించారు. స్థానికంగా ఉన్న ప్రైవేటు కళాశాలలకు వెళ్లే విద్యార్థులు వర్షం కురిసిన సందర్భంలో రహదారి మొత్తం అధ్వానంగా తయారవడంతో ఇబ్బంది పడుతున్నారు. దీనిపై గతేడాది పాఠశాల యాజమాన్యంతో తల్లిదండ్రులు గొడవకు దిగారు. ఏడాది గడచినా రహదారిని నిర్మించలేదు. ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షానికే పాఠశాలకు వెళ్లే రహదారి నీట మునిగి అధ్వానంగా తయారవడంతో విద్యార్థులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు కళాశాలల ప్రాంగణంలో రోడ్డుపై ఆందోళనకు దిగారు. ప్రధాన రహదారి నుంచి 200 మీటర్ల మేర ఉన్న ప్రైవేటు స్థలంలో రహదారి నిర్మాణం చేపట్టక పోవడంతో తామంతా ఇబ్బందులు పడుతున్నామని వారంతా వాపోయారు. యాజమాన్యాలు ముందుకు వచ్చి గతంలో ఇచ్చిన హామీ మేరకు రహదారిని అభివృద్ధి చేయకపోతే ఫీజులు కట్టేదిలేదని చెప్పారు. ప్రైవేటు విద్యాసంస్థల తీరుపై చేపట్టిన ఈ ఆందోళన సుమారు రెండు గంటలకు పైగా కొనసాగింది.

బీసీలపై సవతితల్లి ప్రేమ చూపిస్తున్న పవన్



కవురు శ్రీనివాస్, ఎమ్మెల్సీ

పాలకొల్లు అర్బన్: జనసేన అధినేత పవన్ కల్యాణ్ నరసాపురం సభలో ఎస్సీ, బీసీలపై ప్రేమ ఉన్నట్టు ప్రసంగించడం చూస్తుంటే సవతితల్లి ప్రేమ గుర్తొస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. పాలకొల్లు వైసీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ బీసీ సబ్ ప్లాన్, ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను వైసీపీ ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని పవన్ విమర్శించడం చూస్తుంటే ఆయనకు ఏపీ రాజకీయాల పట్ల అవగాహన లేదని అర్థమవుతోందన్నారు. గోదావరి జిల్లాల్లో పవన్ కల్యాణ్ పర్యటనలో ఆయన మాట్లాడే తీరు చూస్తుంటే టీడీపీ అధినేత చంద్రబాబు రాసిన స్క్రిప్టును అక్షరం వదలకుండా చదువుతున్నట్లు ఉందని శ్రీనివాస్ దుయ్యబట్టారు. టీడీపీ అధికారంలో ఉండగా ఎస్సీ, బీసీ ప్రాంతాల్లోని చంద్రబాబు నాయుడు మూసివేసిన పాఠశాలలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తెరిపించి నాడు– నేడు నిధులతో ఆ పాఠశాలల రూపు రేఖలు మార్చారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సచివాలయ వ్యవస్థ ద్వారా 1.35లక్షల మంది నిరుద్యోగులకు శాశ్వత ఉద్యోగాలు కల్పించారని చెప్పారు. యువతను రెచ్చగొట్టే విధంగా పవన్ మాటతీరుఉందని శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జనసేన పార్టీని స్థాపించి పుష్కర కాలం గడచినా కనీసం అసెంబ్లీ గుమ్మం ఎక్కని పవన్ కల్యాణ్‌కి తన ప్రయోజనం కన్నా చంద్రబాబును సీఎం చేయడం ద్వారా లబ్ధి పొందాలని చూస్తున్నారని ఎమ్మెల్సీ శ్రీనివాస్ దుయ్యబట్టారు.

నేడు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

పాలకొల్లు అర్బన్: పాలకొల్లులో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చేతులమీదుగా బుధవారం మధ్యాహ్నం 3.30గంటలకు ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నట్లు పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు తెలిపారు. పాలకొల్లు కెనాల్ రోడ్డులో మునిసిపల్ వాటర్ వర్క్స్ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన మునిసిపల్ అతిథి గృహాన్ని మంత్రి కారుమూరి ప్రారంభిస్తారన్నారు. అనంతరం వీవర్స్‌కాలనీలో నూతనంగా నిర్మించిన డా. వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం నిర్వహించనున్న సభలో మంత్రి కారుమూరి ప్రసంగిస్తారన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమాలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ విభాగాల నాయకులు విధిగా పాల్గొని విజయవంతం చేయాలని సత్తిబాబు కోరారు.

నేడు మానవత నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

పెనుగొండ: మానవత పెనుగొండ మండల నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం పెనుగొండలో నిర్వహించనున్నట్లు మానవత అధ్యక్షుడు డాక్టర్ బాలచందర్ సాదే, రీజనల్ చైర్మన్ కర్రి నరేంద్ర రెడ్డి సంయుక్త ప్రకటనలో తెలిపారు. నూతన కమిటీ అధ్యక్షుడుగా నేమాని శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా ఏడిటర్ డాక్టర్ నల్లిమిల్లి విజయరాజు, కార్యదర్శిగా అడిగర్ల నరసింహమూర్తి, జాయింట్ సెక్రటరీగా షేక్ మస్తాన్, కోశాధికారిగా బచ్చు లక్ష్మీ నరసింహమూర్తి, ఈసీ ఎమర్జెన్సీ కంబాల మోహన్, ఈసీ ఎడ్యుకేషన్ సీహెచ్ శ్రీనివాసరావు, ఈసీ హెల్త్ మేడపాటి మురళీ జోగిరెడ్డి, ఈసీ ఎవేర్నెస్ కర్ని సురేష్ బాబు ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. ప్రమాణ స్వీకారోత్సవం మేడపాటి ధర్మారెడ్డి కల్యాణ మండపంలో బుధవారం సాయంత్రం 5గంటలకు నిర్వహిస్తామన్నారు.

పేదలకు జగనన్న సురక్ష మంచి అవకాశం

యలమంచిలి: అన్ని అర్హతలు ఉండి చిన్న చిన్న సాంకేతిక సమస్యల వల్ల ప్రభుత్వ పథకాలు అందుకోని లబ్ధిదారులకు న్యాయం చేయడానికి జగనన్న సురక్ష సర్వే అద్భుతమైన అవకాశమని శిరగాలపల్లి సర్పంచ్ చిలుకూరి సుబ్బారావు చౌదరి అన్నారు. శిరగాలపల్లిలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష సర్వేలో ఆయన పాల్గొన్నారు. గ్రామ కార్యదర్శి పీతల రాజశేఖర్, వీఆర్వో జిడ్డు వెంకటరమణయ్య సచివాలయ కన్వీనర్లు సత్తా శ్రీనివాస్, దొంగ నాగలక్ష్మి, పీరవల్లి నరసింహమూర్తి గృహ సారథులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్ధారణకు ఇంటింటి సర్వే

పాలకొల్లు అర్బన్: కుష్టు వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మెడికల్ ఆఫీసర్ డా.అద్దాల ప్రతాప్‌కుమార్ అన్నారు. జాతీయ కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం లంకలకోడేరులో నిర్వహించిన ఇంటింటి సర్వేలో డా. ప్రతాప్‌కుమార్ పాల్గొని సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ నెల 26వ తేదీ నుంచి జూలై 16వ తేదీ వరకు ఇంటింట సర్వే నిర్వహిస్తామన్నారు. డా. నవ్యజీవన్, డీపీఎంవో జక్కంపూడి రాంప్రసాద్, ఆరోగ్య విస్తరణాధికారులు గుడాల హరిబాబు, కె ప్రభాకర్, పీహెచ్ఎన్ పి ఎలిజబెత్, సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

